తీరొక్క పూలతో.. బతుకమ్మలు పేర్చి



ఉట్నూరు : బతుకమ్మను ఎత్తుకున్న ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, సిబ్బంది

ఉట్నూరు, పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : ఉట్నూరు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా పాల్గొన్నారు. మహిళా అధికారులు, సిబ్బంది, స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులతో కలిసి తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మను ఎత్తుకొని ఆడిపాడారు. అందరికీ పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ ప్రాంగణంలో మంగళవారం బతుకమ్మ సంబరాల సందడి నెలకొంది. పాలనాధికారి రాజర్షిషా, ఆయన సతీమణి యాపల్‌గూడ బెటాలియన్ కమాండెంట్ నితికాపంత్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అదనపు పాలనాధికారి శ్యామలదేవి, ఆర్డీవో వినోద్‌కుమార్, కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి, డీసీవో మోహన్, రెవెన్యూ ఉద్యోగినులు పాల్గొన్నారు.



రెవెన్యూ ఉద్యోగినులతో కలిసి బతుకమ్మ ఆడుతున్న పాలనాధికారి సతీమణి నితికాపంత్, అదనపు పాలనాధికారి శ్యామలదేవి



డైట్ కళాశాల రహదారిలో ఒకవైపు ఎండ తీవ్రత ఉండగా.. మరోవైపు వర్షంలో ఆటోలో కూర్చొని కొబ్బరి బొండం తాగుతున్న మహిళ

ఇలా వచ్చి.. అలా వెళ్లిపోయింది!

ఆదిలాబాద్ పట్టణంలో ఉదయం నుంచి ఎండతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వేడి నుంచి ఉపశమనం పొందేందుకు శీతల పానీయాలు, కొబ్బరి బొండాలను తాగారు. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందడానికి దుకాణానికి వచ్చేలోపే వర్షం కురిసింది. ఆటోలోనే కూర్చొని మహిళ బొండం తాగేసింది. ఎండ ఉండగా మరోవైపు వర్షం పడి, అంతలోనే మళ్లీ ఎండ రావడంతో పట్టణవాసులు ఇంతలోనే ఎంత మార్పులు చోటుచేసుకున్నాయో నని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.


- ఈనాడు, ఆదిలాబాద్

ట'మాట' అనలేం.. వెల్లుల్లి కొనలేం

- పండగ వేళ కొండెక్కిన 'కూరగాయలు'

మంచిర్యాల అర్బన్, వాంకిడి న్యూస్‌టుడే

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో కుదేలైన పంట పొలాలు, కూరగాయల తోటలతో పట్టణాలకు పెద్ద కష్టమే వచ్చింది. మహారాష్ట్ర, ఆంధ్ర ప్రాంతంతోపాటు సిద్దిపేట నుంచి వచ్చే కూరగాయలపై ఉమ్మడి జిల్లావాసులు ఆధారపడ్డారు. వేసవి కాలం మాదిరి వర్షాకాలంలోనూ విపణిలో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. అధిక వర్షాలతోపాటు ఉమ్మడి జిల్లాలో కూరగాయల సాగు లేకపోవడం, శ్రావణం, గణపతి, దేవి నవరాత్రి ఉత్సవాలు వరుసగా రావడం ఇందుకు కారణమని వ్యాపారులు పేర్కొంటున్నారు.





కన్నీళ్లు పెట్టిస్తున్న ఉల్లి...



మార్కెట్‌లో మిర్చిబండ్లు, గప్చుప్‌ల వద్ద తప్పనిసరిగా ఉల్లి వాడుతారు. కొద్దిరోజులుగా ఉల్లి ధర దడ పుట్టిస్తుండడంతో వాటిని వాడటమే మానేశారు. ఎందుకంటే మార్కెట్‌లో దాని ధర కిలో రూ. 55. వేసవిలో రూ. 20 ఉన్న ఉల్లి రెట్టింపు కావడంతో వంటల్లో వాటిని వాడడం తక్కువ చేశారు. ఉమ్మడి జిల్లాకు కర్నూలు, సోలాపూర్ నుంచి ఎక్కువగా దిగుమతి అవుతుంది. నెల క్రితం వరకు కిలో రూ. 40 ఉన్న అలుగడ్డ ప్రస్తుతం రూ. 50 పలుకుతోంది. ఉత్తరప్రదేశ్ నుంచి దిగుమతి అయ్యే ఆలుగడ్డ ధరలు ఇప్పట్లో తగ్గడం కష్టమే అంటున్నారు వ్యాపారులు.

ఇతర వాటి పరిస్థితి అంతే..

సంత రోజు కూరగాయలు కొనేందుకు వెళ్తే రూ.500 ఖర్చు అవుతున్నాయి. వారానికి ఇంత ఖర్చయితే ఎలా అని సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో లభ్యమయ్యే ఆకుకూరల ధర కూడా పెరిగిపోయింది. కొత్తిమీర నాందేడ్ నుంచి దిగుమతి కావడంతో రూ.20 ఇస్తే కానీ చిన్న కట్ట ఇవ్వడం లేదు.



వెల్లుల్లిదీ అదే దారి..



కరోనా సమయంలో కిలో రూ.60 ఉన్న వెల్లుల్లి ధర కొద్దిరోజులుగా కిలో రూ.320కి చేరింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్ నుంచి ఉమ్మడి జిల్లాకు వెల్లుల్లి వస్తుంది. ప్రతి అయిదు సంవత్సరాలకు ఒకసారి ధరలు హెచ్చుతగ్గులు ఉంటాయన్నారు. కొత్త పంట వచ్చే వరకు ఈ తిప్పలు తప్పవంటున్నారు.

వర్షాలతో తగ్గిన దిగుమతి

కొద్దిరోజులుగా విస్తారంగా కురిసిన వర్షాలతో తెలుగు రాష్ట్రాల్లో కూరగాయల సాగుకు ఇబ్బంది నెలకొంది. మంచిర్యాల మార్కెట్‌కు సిద్దిపేట, ఒంటిమామిడి, గంగాపూర్, కళ్యాణదుర్గం నుంచి కూరగాయలు వస్తుంటాయి. ఆదిలాబాద్ జిల్లాలోని కొన్ని మండలాల్లో టమాట, వంకాయ సాగు చేస్తున్నప్పటికీ తీగజాతి కూరగాయలకు ఇతర ప్రాంతాల మీద ఆధారపడాల్సిందే. నిర్మల్ జిల్లాలో పత్తి, వరి, మొక్కజొన్న, సోయా, పసుపు పంటలు ఎక్కువగా ఉంటాయి. కూరగాయల సాగు చాలా తక్కువ. ఈ జిల్లావాసులు మహారాష్ట్ర, నిజామాబాద్, సిద్దిపేట ప్రాంతాల పంటలపై ఆధారపడుతున్నారు. కుమురంభీం జిల్లాలో రెబ్బెన మండలం గంగాపూర్‌లో కొంత కూరగాయలు సాగు చేస్తున్నప్పటికీ స్థానికంగా విక్రయించడంతోపాటు మంచిర్యాలకు దిగుమతి చేస్తున్నారు.

సామాన్యులకు శరాఘాతం

- గడ్డం మధుకిరణ్, ప్రైవేటు ఉద్యోగి, మంచిర్యాల




గత కొద్దిరోజులుగా కూరగాయల ధరల పెరుగుదల ఆందోళన కల్గిస్తోంది. పట్టణ ప్రాంతాల్లో ప్రతి కూరగాయ, ఆకుకూర కొనాల్సిందే. టమాట ధర పెరిగిన కొనక తప్పడం లేదు. వీటికి తోడు ఉల్లి, వెల్లుల్లి ధరలు పెరిగాయి. మార్కెట్‌కు రూ. 500తో వెళ్లినా వారం రోజుల పాటు సరిపడా కూరగాయలు రావడం లేదు. కూరగాయలకు బదులు పప్పులు వండాల్సి వస్తుంది.

యువత వాయుసేనలో చేరాలి



కేకు కోస్తున్న పాలనాధికారి రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం, యాపల్‌గూడ బెటాలియన్ కమాండెంట్ నితికా పంత్

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : దేశ సేవ కోసం యువత వాయు సేనలో చేరాలని పాలనాధికారి రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని మాజీ సైనిక సంక్షేమ సంఘం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన భారత వైమానిక దళ దినోత్సవంలో వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. యుద్ధ సమయంలో శత్రు దేశాల నుంచి భారత భూభాగాన్ని రక్షించడమే కాకుండా ప్రకృతి విపత్తుల్లో ప్రజలకు సేవ చేయడంలో వాయుసేన పాత్ర చాలా కీలకమైందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అగ్నివీర్‌వాయు పథకంలో యువకులను వాయుసేనలో భర్తీ చేస్తుందన్నారు. అమరులైన మాజీ సైనికుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారు. సైనిక సంక్షేమ ప్రాంతీయ అధికారి వేంకటేశ్వర్లు, మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్‌దాస్, మేజర్ మజర్ హుస్సేన్, మేజర్ డా.కారుణ్య, మాజీ సైనికులు తదితరులు ఉన్నారు.



న్యూస్‌టుడే, పాలనాప్రాంగణం

ఉపాధ్యాయ నియామకానికి సంబంధించి అభ్యర్థుల ఎంపిక తుది జాబితాను విద్యాశాఖ విడుదల చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో బుధవారం ఎల్బీ స్టేడియంలో ఎంపికైన అభ్యర్థులకు నియామకపత్రాలు అందజేయనున్నారు. జిల్లా నుంచి ప్రత్యేక బస్సుల్లో వారిని తరలించనున్నారు. ఎంపికైన అభ్యర్థులకు విద్యాశాఖ సిబ్బంది ఫోన్లు చేసి సమాచారం ఇచ్చారు. ఇదిలా ఉంటే ఎంపిక జాబితాలో పలు పొరపాట్లు దొర్లడం అభ్యర్థులను ఆందోళనకు గురి చేసింది. అనర్హులను ఆ జాబితా నుంచి తొలగించి తమకు అవకాశం ఇవ్వాలని పలువురు డీఈవో కార్యాలయానికి వచ్చి వినతిపత్రాలు సమర్పించారు.

డీఎస్సీ -2024 ద్వారా ఉపాధ్యాయుల భర్తీకిగాను 324 పోస్టులను గుర్తించారు. ఇటీవల 1:3 ప్రాతిపదికన డైట్ కళాశాలలో అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించిన సంగతి తెలిసిందే. ఒక్కో అభ్యర్థి ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు ఎంపికవడంతో వారి స్థానంలో ఆ ఖాళీలు మిగిలిపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకున్నా.. తుది జాబితాలో మాత్రం పలు పొరపాట్లు దొర్లాయి. పలు కేటగిరిల్లో అభ్యర్థులు లేక 58 పోస్టులు ఖాళీగా మిగిలిపోనున్నాయి. అత్యధికంగా ఉర్దూ మాధ్యమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు లేక 43 పోస్టులు భర్తీ కాకుండా పోయాయి. మిగిలిన 266 పోస్టులకు 1:1 ప్రాతిపదికన ఎంపిక చేసిన ఎంపిక చేసి అభ్యర్థుల తుది జాబితా జిల్లాకు చేరగా.. పాలనాధికారి రాజర్షిషా ఆమోదంతో ఆ జాబితాను డీఈవో ప్రణీత సాయంత్రం విడుదల చేశారు. అభ్యర్థుల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఉన్నతాధికారులకు నివేదిస్తామని స్పష్టం చేసిన డీఈవో అర్హులు ఆందోళన చెందవద్దని చెప్పారు.

పొరపాట్లు దొర్లాయి ఇలా..

- ఎస్జీటీ విభాగంలో ఓ అభ్యర్థి తెలుగు, హిందీ మాధ్యమంలో రెండు జాబితాల్లో ఎంపికయ్యారు.
- ఎస్జీటీ విభాగంలో 12వ ర్యాంకు సాధించిన సాయికృష్ణ పేరు జాబితాలో లేకపోగా.. ఆయన తర్వాతి ర్యాంకర్లకు చోటు లభించింది.
- నాలుగు ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థి శివాజీ తాను కోరుకున్న ఎస్ఏ ఫిజికల్ సైన్సుకు బదులు ఎస్ఏ తెలుగు పోస్టు దక్కింది.
- ఎస్జీటీ స్పోర్ట్స్ కోటాలో సర్టిఫికెట్ల పరిశీలనకు రాని అభ్యర్థికి చోటు కల్పించారని ఉద్యోగ అవకాశం చేజారిన అభ్యర్థి సాయికుమార్ ఫిర్యాదు చేశారు.
- మరాఠీ మాధ్యమ ఎస్జీటీకి ఎంపికైన ఓ అభ్యర్థి తప్పుడు ధ్రువీకరణ పత్రం సమర్పించారనే అభియోగంపై ఆ నియామకాన్ని తాత్కాలికంగా నిలిపేశారు.

కేటగిరి వారీగా పోస్టుల భర్తీ ఇలా..

కేటగిరి	నోటిఫై	ఎంపిక
ఎస్ఏ బయోసైన్సు	14	14
„ మాథ్స్	10	08
„ మరాఠీ	01	01
„ ఫిజిక్స్	09	07
„ సోషల్	24	23
„ స్పెషల్‌ఎడ్యుకేషన్	01	01
„ ఆంగ్లం	08	07
„ తెలుగు	05	05
„ హిందీ	02	02
„ ఉర్దూ	01	0
„ పీడీ(స్పెషల్)	05	04
ఎస్జీటీ (తెలుగు)	148	143
„ (ఉర్దూ)	41	04
„ (హిందీ)	06	06
„ (మరాఠీ)	14	12
„ (స్పెషల్)	19	16
ఎల్పీ	14	12
పీఈటీ	02	01
మొత్తం	324	266

దరఖాస్తుల ఆహ్వానం

పాలనాప్రాంగణం: జిల్లాలోని ఆయా కళాశాలల్లోని ఖాళీల భర్తీకి అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఐఈవో రవీందర్ పేర్కొన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో ఆంగ్లం, ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్), బాలుర కళాశాలలో హిందీ, ఇచ్చోడలో ఎంపీహెచ్‌డబ్ల్యూ, నార్నూర్ కళాశాలలో కెమిస్ట్రీలో ఒక్కో పోస్టు ఖాళీగా ఉందని వివరించారు. ఈ నెల 11లోగా డీఐఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

దస్నాపూర్‌లో దసరా ఏర్పాట్లు



పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : ఎమ్మెల్యే పాయల్ శంకర్ దసరా ఏర్పాట్లకు దస్నాపూర్ మైదానంలో మంగళవారం హిందూ ఉత్సవ సమితి సభ్యులతో కలిసి భూమి పూజ చేశారు. దసరా సంబరాలు హిందువుల ఐక్యతకు నిదర్శనమన్నారు. దసరా రోజున కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి మొదలయ్యే పాదయాత్రలో ప్రతి హిందువు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమితి అధ్యక్ష, కార్యదర్శులు హన్మాండ్లు, లెనిన్, భాజపా నాయకులు వేణుగోపాల్, రాళ్లబండి మహేందర్, భరత్, రఘుపతి, లాలామున్నా తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి తైక్వాండో ఎంపిక పోటీలు

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో బుధవారంఅండర్-14, 17 ఏళ్ల విభాగాల్లో బాలబాలికల జిల్లాస్థాయి తైక్వాండో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి కాంతారావు తెలిపారు. బోనాఫైడ్, ఆధార్ పత్రాలతో పోటీల నిర్వాహకుడు వీరేశ్‌కు రిపోర్టు చేయాలని సూచించారు.

పత్తి కొనుగోళ్ల సన్నద్ధతపై సమీక్ష

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : పత్తి కొనుగోళ్ల సన్నద్ధతపై పాలనాధికారి రాజర్షిషా మంగళవారం వీడియో కాన్ఫరెన్సు ద్వారా తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీసీఐ పత్తి కొనుగోళ్ల తర్వాత నగదును ఆధార్ అనుసంధానం ఉన్న ఖాతాలో జమ చేస్తుందని చెప్పారు. ఈ విషయమై ఏ బ్యాంకు ఖాతా అనుసంధానం అయి ఉందో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌలు రైతులు ఏఈవో ధ్రువీకరణ పత్రంతో పత్తిని విక్రయించవచ్చని పేర్కొన్నారు. అదనపు పాలనాధికారి శ్యామలదేవి, వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులు శ్రీధర్, గజానంద్, ఆర్డీవో వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆరోగ్యశాఖపై సమీక్ష నిర్వహించారు. డీఎంహెచ్‌వో కృష్ణ, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పట్టణ బంద్‌కు పిలుపు

ఎదులాపురం, న్యూస్‌టుడే : ప్రవక్త మొహ్మద్‌పై యతి నర్సింహా సరస్వతి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం ఆదిలాబాద్ పట్టణ బంద్‌కు ముస్లిం సోదరులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఖుర్షిద్‌నగర్‌లోని నూర్ మసీదు వద్ద మౌలానా అలీం మాట్లాడుతూ యతి నర్సింహా సరస్వతి వ్యాఖ్యలు ముస్లిం సమాజ మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయని అన్నారు. మౌలానా ఆరిఫ్‌ఖాన్, సర్దార్ రహిమానీ, నజీర్ అహ్మద్, సిరాజ్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

దారులు దారుణం



పిట్టబొంగరం పంచాయతీ పరిధిలోని పాటగూడ వద్ద కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకలవ్య ఆదర్శ పాఠశాల వద్ద రహదారి అధ్వానంగా మారింది. విద్యార్థుల తల్లిదండ్రులు రావాలంటే గుంతలను తప్పించుకుని గమ్యం చేరుకోవాల్సి వస్తోంది.




ఇంద్రవెల్లి మండలం ముత్నూరు నుంచి సిరికొండ మండల ప్రధాన రహదారి ఇది. ఈ రహదారిపై 9 కి.మీ. దూరం ప్రయాణం చేయాలంటే వందలాది గుంతలను తప్పించుకుని వెళ్లాల్సిన పరిస్థితి. ఈ రోడ్డు మరమ్మతులకు అత్యవసర నిధుల కింద రూ.5.42 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

న్యూస్‌టుడే, ఇంద్రవెల్లి

- నిధులు మంజూరైతేనే సాఫీగా ప్రయాణం

పల్లె రహదారులు ప్రమాదకరంగా మారాయి. నిధులు మంజూరైతే వీటికి మోక్షం కలగనుంది. మరమ్మతులకు అత్యవసర నిధులు మంజూరు చేయాలని ఇటీవల ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, కలెక్టర్ రాజర్షిషాలు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 27.91 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. 20 ఏళ్ల కిందట నిర్మించిన ఇంద్రవెల్లి మండలంలోని పలు మారుమూల గిరిజన గ్రామాల రహదారుల మరమ్మతులపై గత ప్రభుత్వాలు దృష్టి సారించలేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారులు మరింత అధ్వానంగా మారాయి. కలెక్టర్, ఎమ్మెల్యేలు స్వయంగా వాటి పరిస్థితిని పరిశీలించారు. నిధులు మంజూరైతే సాఫీగా ప్రయాణం సాగుతుందని ఈ ప్రాంత వాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు.



ఇంద్రవెల్లి నుంచి హీరాపూర్ పంచాయతీ మీదుగా సిరికొండ మండలం పోచంపల్లి పంచాయతీ రోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. మరమ్మతులకు రూ.8.59 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపారు. ఈ రోడ్డుతో పాటు ఉట్నూరు మండలం నర్సాపూర్(బి) నుంచి ఇంద్రవెల్లి మండలం గట్టెపల్లికి రోడ్డుకు రూ.6.60 కోట్లు, ముత్నూరు నుంచి గిన్నెర రోడ్డుకు రూ.2.60 కోట్లు, ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి పిప్రి రోడ్డుకు రూ.70 లక్షలతో ప్రతిపాదనలు పంపారు.



ఇంద్రవెల్లి మండల కేంద్రం నుంచి ఆదిలాబాద్ గ్రామీణ మండలం చిద్దరి ఖానాపూర్ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. ఈ రోడ్డు మరమ్మతులకు పదేళ్లుగా నిధులు మంజూరు కాలేదు. ఇటీవల రూ.4 కోట్లతో ప్రతిపాదనలు పంపారు.

నిధులొస్తే పనులు పూర్తి చేయిస్తాం

- పవార్ రమేష్, డీఈఈ, పీఆర్ ఉట్నూరు

రహదారుల మరమ్మతులకు కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుల ఆదేశాల మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాం. నిధులు మంజూరు కాగానే టెండర్లు పిలిచి పనులు పూర్తి చేయిస్తాం.



విద్యుద్దీపాలంకరణలో ఆలయం



గదులు లేకపోవడంతో ఆరుబయట నిద్రిస్తున్న భక్తులు

మూల నక్షత్ర వేడుకలకు బాసర సిద్ధం

బాసర(ముథోల్), న్యూస్‌టుడే: జిల్లాలోని బాసర జ్ఞాన సరస్వతి ఆలయం బుధవారం మూల నక్షత్ర వేడుకలకు ముస్తాబైంది. సరస్వతి అమ్మవారి జన్మ నక్షత్రం మూల కావడంతో ఈ వేడుకలకు ప్రత్యేకత ఉంది. వేకువజామున రెండు గంటల నుంచి చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహిస్తారు. సాయంత్రం అమ్మవారికి చతుషష్టి పూజలు, హారతి, నివేదన కార్యక్రమాలు సాగుతాయి. ఈ శుభఘడియల్లో ఆలయంలో తమ చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించేందుకు తెలుగు రాష్ట్రాలతోపాటు పొరుగురాష్ట్రాల నుంచి భక్తులు రైళ్లు, బస్సులు, సొంతవాహనాల ద్వారా బాసరకు చేరుకుంటున్నారు. మంగళవారం సాయంత్రం నుంచి బాసరకు భక్తుల రాక మొదలైంది. నవరాత్రి ఉత్సవాల్లో ఒకరోజు సరస్వతి అమ్మవారి జన్మనక్షత్రం వస్తుంది. ఆ రోజు అమ్మవారి చెంత అక్షరాభ్యాసాలు నిర్వహిస్తే ప్రయోజకులవుతారనే విశ్వాసంతో భక్తులు భారీగా తరలివస్తారు. అక్షరాభ్యాసాలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఏర్పాట్లు పూర్తి

సరస్వతి అమ్మవారి మూల నక్షత్ర వేడుకలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అక్షరాభ్యాసాలు, దర్శనాలు, పూజల సమయంలో భక్తులకు సమస్యలు తలెత్తకుండా దేవాదాయశాఖ జాగ్రత్తలు తీసుకుంది. రద్దీకి అనుగుణంగా అక్షరాభ్యాస మండపాలను ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణలో అదనపు టిక్కెట్ కౌంటర్లు, ప్రసాదాల కౌంటర్లను ఏర్పాటు చేశారు. గతంలో జరిగిన సంఘటనల దృష్ట్యా ఈసారి వీఐపీ పాసులను రద్దు చేశారు. ప్రముఖులకు దర్శనాలు చేయించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. అందుకు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ టికెట్ కొనుగోలు చేసిన వారికి ప్రత్యేకంగా వరుస ఏర్పాటు చేసి వారికి



క్యూలైన్లలో భక్తులు కూర్చోవడానికి ఏర్పాటుచేసిన బెంచీలు

దర్శనం కల్పించనున్నారు. ఉచిత దర్శనం, రూ.150 అక్షరాభ్యాసాలకు పోలీస్‌స్టేషన్ వైపు నుంచి, ప్రత్యేక దర్శనం కోసం ఆలయాధికారి కార్యాలయం ఎదుటి నుంచి వరుసలను ఏర్పాటు చేశారు. వరుసలో ఉన్న భక్తులు కూర్చుండేలా బెంచీలను ఏర్పాటు చేశారు. భద్రత, పార్కింగ్ పరంగా ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. భక్తుల సేవలకు పలు సంఘాలు, భక్తబృందాల సేవలను ఆలయం వినియోగించనుంది. పుణ్యస్నానాల వేళ భక్తుల భద్రతకు గోదావరి నది వద్ద ఏర్పాట్లు చేశారు. ఆర్టీసీ నిజామాబాద్, భైంసా డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతోంది.

నిండిన గదులు.. ఆరుబయటే భక్తులు

ఆలయానికి చెందిన వంద వసతి గదులు మరమ్మతుల్లో ఉండటం, మిగిలిన వసతి గృహాలు ప్రముఖులకే కేటాయించడంతో బాసరకు వచ్చే భక్తులకు వసతి కష్టాలు మొదలయ్యాయి. ప్రైవేట్ లాడ్జీల్లో గదుల ధరలు రెండింతలు చేశారు. దీంతో సామాన్య భక్తుల పరిస్థితి దారుణంగా తయారైంది. డబ్బు ఉన్న వారు ప్రైవేట్ గదులను అద్దెకు తీసుకున్నారు. డబ్బులు లేని వారు ఆరుబయటనే సేదతీరాల్సి వస్తోంది. కొందరు భక్తులు నిజామాబాద్, ఆర్మూర్, కామారెడ్డి పట్టణాల్లోనే బసచేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. వీరంతా బుధవారం ఉదయం బాసరకు రానున్నారు.

జిల్లాలోని ఓ మండలానికి చెందిన వ్యాపారికి తొలి సంతానంగా కుమార్తె పుట్టింది. రెండో కాన్పులో కూడా మూడు ప్రయత్నంలోనూ బాలిక పుట్టింది. మహారాష్ట్రలో గుట్టుచప్పుడు కాకుండా లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు. మగ బిడ్డ ఉన్నట్లు ముందే తెలుసుకున్నారు. ఒక వేళ ఆడపిల్ల ఉంటే పరిస్థితి మరోలా ఉండేది.

నేడు పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. దేశవ్యాప్తంగా దుర్గా నవరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆదిపరాశక్తిని ఆరాధించే ప్రజలే ఆడపిల్ల అంటే చిదిమేస్తున్నారు. శివుడిలో సగం.. అవనిలో సగం అంటూనే తమ ఇంట మాత్రం వదిలించుకోవాలని చూస్తున్నారు. కాసుల కోసం కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలు పుట్టబోయేది ఆడ, మగ అనేది ముందే చెప్పేస్తూ భ్రూణహత్యలను ప్రోత్సహిస్తున్నాయి. జిల్లాలో నిరక్షరాస్యత, పేదరికం కూడా వాటికి తోడవుతోంది.

-న్యూస్‌టుడే, ఆదిలాబాద్ గ్రామీణం



ఆదిశక్తి ఆరాధన.. ఆడపిల్లకు నిరాదరణ

ఇలా చేస్తే ప్రయోజనం..

- లింగ నిర్ధారణ పరీక్షలు జరపకుండా కఠిన చర్యలు తీసుకోవాలి.
- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఈ విషయమై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి.
- వరకట్న నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. వరకట్నం తీసుకున్నట్లు తెలిస్తే విచారణ జరిపి కఠినంగా శిక్షించాలి.
- ఆడపిల్లల చదువు కోసం గతంలో మాదిరిగా బంగారుతల్లి వంటి పథకాలను అమలు చేయాలి.
- ఆడ శిశువులకు జన్మనిచ్చిన వారికి ప్రోత్సాహకాలు అందించాలి.
- స్వయం ఉపాధి, ప్రభుత్వ ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యం మరింత పెంచాలి.

లింగనిష్పత్తి ● బాలురు ● బాలికలు

జిల్లా	బాలురు	బాలికలు
ఆదిలాబాద్	1000	989
నిర్మల్	1000	1046
కుమురం భీం	1000	998
మంచిర్యాల	1000	977

● ఆందోళన కలిగిస్తున్న బాలబాలికల నిష్పత్తి

● జిల్లా ● 0 నుంచి 6 ఏళ్ల పిల్లలు ● బాలురు ● బాలికలు

జిల్లా	0 నుంచి 6 ఏళ్ల పిల్లలు	బాలురు	బాలికలు
కుమురంభీం	66206	34053	32153
నిర్మల్	82769	42,462	40,307
మంచిర్యాల	73725	38578	35147
మంచిర్యాల	89,283	46,225	43058




ఆడపిల్లల సంఖ్య తగ్గడానికి కారణాలు ఏమిటి? జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్ష నియంత్రణ చట్టం పకడ్బందీగా అమలు చేస్తున్నారా? ఆడపిల్లల సంఖ్య పెరగడానికి ప్రభుత్వం ఏం చేయాలన్న అంశాలపై జిల్లాలో 100 మందిపై 'న్యూస్‌టుడే' సర్వే నిర్వహించింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.


మహారాష్ట్రలో లింగ నిర్ధారణ పరీక్షలు..

జిల్లాలోని పలు ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలు, ఆసుపత్రులపై అధికారుల నిఘా కరవైంది. గతంతో పోల్చితే నిర్ధారణ పరీక్షలు తగ్గినా.. గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతున్నట్లు సమాచారం. కొంత మంది స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు ఆడ, మగ అన్నది కోడ్ రూపంలో తెలియజేస్తున్నారు. ఆడపిల్ల అని తెలిస్తే భ్రూణహత్యలకు పాల్పడుతున్నారు. జిల్లావాసులు సరిహద్దులోని మహారాష్ట్రకు లింగ నిర్ధారణ పరీక్షల కోసం వెళ్తున్నారు. అక్కడి ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలు డబ్బుల ఆశతో ఆడ, మగ అన్నది తెలియజేస్తున్నాయి. ఫలితంగా చాలా మంది అక్కడే గుట్టుచప్పుడు కాకుండా పరీక్షలు చేసుకుంటున్నారు.

1 నేటి సమాజంలో చదువు, ఇతర విషయాల్లో ఆడ, మగ పిల్లలకు సమ ప్రాధాన్యం ఉందా?



2 లింగ నిర్ధారణ, బాల్య వివాహాలు, వరకట్న నిషేధం వంటి వాటి నియంత్రణ, మహిళల భద్రతలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటున్నాయా?



● జనాభా ● పురుషులు ● మహిళలు



జిల్లా	జనాభా	పురుషులు	మహిళలు
కుమురంభీం	5,15,812	258197	257615
నిర్మల్	709418	346721	362697
మంచిర్యాల	807037	408272	398765
ఆదిలాబాద్	7,08972	3,56,407	3,52,565

తాపీమేస్త్రీలు.. సహాయకులకు



దండేపల్లిలో గోడల నిర్మాణంపై మహిళలకు శిక్షణ ఇస్తున్న చిత్రం ఇది. పునాది వేయడం దగ్గర నుంచి భవన నిర్మాణం వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పగుళ్లు రాకుండా ఉండాలంటే సామగ్రి ఎంపికతో పాటు వీటిని ఏ నిష్పత్తిలో కలపాలి, సరైన కొలతల ప్రకారం ఎలా నిర్మించాలో తెలియజేస్తున్నారు. నాణ్యత, అందంగా ఉండటానికి చేపట్టాల్సిన అంశాలపై శిక్షణ ఇస్తున్నారు.

కూలీల కుటుంబ సభ్యులకు..



ఆదిలాబాద్‌లో మహిళలకు ఇస్తున్న కుట్టు మిషన్ శిక్షణ చిత్రమిది. మూడు నెలలపాటు శిక్షణ ఇస్తున్నారు. వీరికి శిక్షణ అనంతరం కుట్టు మిషన్ అందజేయనున్నారు. కూలీల కుటుంబ మహిళా సభ్యులతోపాటు గుర్తింపు కార్డు ఉన్న మహిళలకు సైతం శిక్షణ ఇస్తారు. కుట్టుతోపాటు ఎంబ్రాయిడరీ, కంప్యూటర్‌తో మెరుగులు తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు.

నైపుణ్య శిక్షణ.. ఉపాధికి బాసట

● దండేపల్లిలో పురుషులతోపాటు మహిళలకు శిక్షకుడు వెంకటేశ్వర్లు భవన నిర్మాణ కూలీలు, తాపీ మేస్త్రీలు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబరు, వెల్డింగ్, పెయింటింగ్ తదితర వృత్తుల్లో నైపుణ్యాలను మెరుగుపర్చుకునేందుకు శిక్షణ ఇస్తున్నారు. 15 రోజులపాటు శిక్షణ ఇవ్వడంతోపాటు రోజుకు రూ.300లతో పాటు దుస్తులు, హెల్మెట్ అందజేస్తారు.

దండేపల్లి, న్యూస్‌టుడే: స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకునేందుకు మహిళలు సైతం వివిధ అంశాల్లో నైపుణ్య శిక్షణ పొందుతున్నారు. తమలోని సృజనాత్మకతతో వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. భవన నిర్మాణ మేస్త్రీల దగ్గర నుంచి కుట్టు మిషన్, ప్లంబర్, గోడలకు పెయింటింగ్ ఇలా పలు రంగాల్లో రాణిస్తూ మార్పులకు అనుగుణంగా తమ వృత్తులను మెరుగుపర్చుకుంటున్నారు. వీరిలో ఉన్న వృత్తి నైపుణ్యాలు పెంపొందించేందుకు జాతీయ నిర్మాణ అకాడమీ(న్యాక్) యువతకు శిక్షణ ఇస్తోంది. లేబర్ గుర్తింపు కార్డు ఉన్న నిరుద్యోగ పురుషులతో పాటు మహిళలకు సైతం తరగతులు నిర్వహిస్తూ వృత్తులపై క్షేత్రస్థాయిలో శిక్షణ ఇస్తున్నారు.



కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో గోడలకు రంగులు వేయడంపై శిక్షణ పొందుతున్న మహిళలు

ఉపయోగకరంగా ఉంది: చింతల లహరి, కిష్టాపూర్, జన్నారం మండలం



వారం రోజులుగా దండేపల్లిలో నిర్వహిస్తున్న కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్నాను. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరిస్తూ మాతో పనులు చేయిస్తున్నారు. కుట్టుతోపాటు తాపీమేస్త్రీ, సిమెంటు పనులపై శిక్షణ తీసుకుంటున్నాం. ఇది చాలా ఉపయోగకరంగా ఉంది.

రుణాలు పొందే అవకాశం

ఎం.నాగేంద్రం, న్యాక్ సహాయ సంచాలకుడు(ఏడీ), ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా



న్యాక్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాల్లో భవన నిర్మాణ కూలీల నుంచి వివిధ వృత్తుల వారికి నైపుణ్య శిక్షణ ఇస్తున్నాం. 15 రోజులపాటు తరగతులు నిర్వహిస్తూనే, క్షేత్రస్థాయిలో వివిధ అంశాల్లో మెలకువలు నేర్పుతున్నాం. శిక్షణ పొందిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందించడంతో పాటు నిబంధనల మేరకు రుణాలు అందించే అవకాశం ఉంది.

నేత్రపర్వం.. ధనలక్ష్మి రూపం

చెన్నూరు పట్టణంలోని ఆర్య వైశ్య సంఘ భవనంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారి మండపాన్ని ఉత్సవ నిర్వాహకులు రూ.25,25,555 కరెన్సీ నోట్లతో అలంకరించారు. స్థానిక భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

-న్యూస్‌టుడే, చెన్నూరు



చెన్నూరులోని ఆర్యవైశ్య సంఘ భవనంలో దుర్గాదేవి మండపాన్ని రూ.25,25,555లతో అలంకరించిన నిర్వాహకులు

పసిపాప పాల కోసం ఆవు విరాళం

బేల, న్యూస్‌టుడే : బేల మండలం టెంబ్రీగూడకు చెందిన పసిపాప దయనీయ పరిస్థితిని 'ఈనాడు'లో చూసి బోథ్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి బి.హుస్సేన్ చలించారు. మంగళవారం ఇచ్చోడ జై శ్రీరామ్ గోశాల నుంచి ఆవు, దూడను పసిపాప తండ్రికి అందజేశారు. దేశ్‌ముఖ్ మారుబాయి ఆడపిల్లకు జన్మనిచ్చిన 23 రోజులకే చనిపోయింది. తల్లిని కోల్పోయిన పసిపాపను బతికించేందుకు అమ్మమ్మ, తాతమ్మలు పడరాని పాట్లు పడుతున్నారు. మూడు రోజులకోసారి పాల డబ్బా కొనుగోలు కోసం పడుతున్న పాట్లపై 'పసిపాప ఆకలి తీర్చేందుకు 6 కిలో మీటర్ల కాలినడక' శీర్షికన 'ఈనాడు'లో ఈ నెల 5న కథనం ప్రచురితమైంది. కథనాన్ని చూసి న్యాయమూర్తి స్పందించారు. ఆవును, దూడను వారికి ఇచ్చారు. గోశాల నిర్వాహకుడు రాజేశ్ ఉన్నారు. మరోవైపు మానవతావాదులు తమ వంతుగా ఆర్థిక సాయం చేసి అండగా నిలుస్తున్నారు. ఇప్పటి వరకు విరాళాలు రూ.32,400 జమయ్యాయి.



పసిపాప తండ్రికి ఆవు, దూడను అందజేస్తున్న న్యాయమూర్తి హుస్సేన్

వందనం

బోగస్ స్వచ్ఛంద సంస్థలపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి పట్టణం: నకిలీ నియామక పత్రాలు అందజేస్తున్న బోగస్ స్వచ్ఛంద సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం బెల్లంపల్లిలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విద్యాశాఖ పరిధిలో విద్యాంజలి 2.0 ప్రత్యేక పోర్టల్‌ను తీసుకొచ్చిందన్నారు. కొంతమంది ఈ పోర్టల్‌ను దుర్వినియోగం చేస్తూ ఉచితంగా వాలంటీర్లను స్వచ్ఛంద సంస్థల ద్వారా ఏర్పాటు చేస్తామని నిరుద్యోగుల నుంచి రూ.లక్షలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

ఆ విద్యార్థులది గ్రామీణ నేపథ్యం. చదువంటే ఎంతో మక్కువ. ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలపై పట్టు సాధించడంతోపాటు వివిధ అంశాల్లోనూ తమదైన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. వారిలోని సృజనాత్మకతను గుర్తించి 28వ 'ప్రేరణ' జాతీయ సదస్సుకు ఎంపికయ్యే అవకాశం వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చదువుకున్న గుజరాత్‌లోని వాద్‌నగర్ పాఠశాలలో సెప్టెంబరు 21-28 తేదీల మధ్య నిర్వహించిన శిక్షణకు హాజరయ్యారు. తెలంగాణ నుంచి కేవలం ఒక్క నిర్మల్ జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులకు మాత్రమే చోటు లభించడం విశేషం.

-న్యూస్‌టుడే, నిర్మల్ అర్బన్



సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు, గైడ్ టీచర్

గ్రామీణ నేపథ్యం.. అరుదైన అవకాశం

● 'ప్రేరణ' జాతీయ సదస్సు.. రాష్ట్రం నుంచి నిర్మల్ జిల్లా విద్యార్థులు

మామడ మండలం కొరటికల్‌కు చెందిన ఎం.రాజేందర్-లక్ష్మి దంపతుల కుమారుడు రాహుల్ ప్రస్తుతం స్వగ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. తండ్రి కులవృత్తి నిర్వహిస్తుండగా, తల్లి గృహిణి. చదువే ధ్యేయంగా నిత్యం పరితపిస్తూ ముందుకెళ్తున్నాడు. ఆదిలాబాద్ జిల్లా కెరమెరి మండలం పరందోలి ముఖదంగూడ గ్రామానికి చెందిన ఎస్.హరీంద్రకుమార్-శ్వేత దంపతుల కూతురు ఎస్.హర్షిత నిర్మల్ పట్టణం సోఫీనగర్‌లోని గురుకుల బాలికల విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుతోంది. తండ్రి ప్రైవేటు అధ్యాపకుడు, తల్లి గృహిణి. అయిదో తరగతిలో పోటీ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చి విద్యాలయంలో సీటు సంపాదించాడు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 'ప్రేరణ మహోత్సవం'లో భాగంగా 'ఏక్ భారత్-వికసిత్ భారత్' పేరిట పాఠశాల, జిల్లా స్థాయిలో సహపాఠ్యాంశాలైన వ్యాస రచన, ఉపన్యాసం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వీటికి కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపల్ నోడల్ అధికారిగా వ్యవహరించి ఏప్రిల్-మే నెలలో నిర్వహించిన పోటీల్లో వీరిని ఎంపిక చేశారు.



గుజరాత్‌లోని మ్యూజియం విశేషాలను విద్యార్థులకు వివరిస్తున్న గైడ్

ప్రప్రథమంగా..

ఇప్పటి వరకు నిర్వహించిన జాతీయ సదస్సుల్లో జిల్లా నుంచి ఎంపికైన వారు లేరు. 28వ ప్రేరణకు మాత్రం రాష్ట్రం నుంచి అదీ నిర్మల్ జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికవ్వడం చెప్పుకోదగ్గ విషయం. వీరికి గైడ్ టీచర్‌గా నిర్మల్ పట్టణం సోఫీనగర్‌లోని గురుకుల బాలికల విద్యాలయం పీజీటీ (ఆంగ్ల బోధకురాలు) బి.కల్పన వ్యవహరించారు. వీరితోపాటు అసోం, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, జమ్మూకశ్మీర్, మేఘాలయ రాష్ట్రాలకు చెందిన మొత్తం 20 మంది విద్యార్థిని, విద్యార్థులకు చోటు లభించింది. ప్రయోగాత్మక, బోధనోపకరణాలు, విలువలతో కూడిన విద్య ఎంతో అవసరమని నిపుణులైన నవోదయ విద్యాలయాలకు చెందిన సీనియర్ బోధకులు వివరించారు. సత్యం, అహింస, దేశభక్తి, సంస్కృతి, సంప్రదాయాలు, విలువలు, చరిత్రాత్మకమైన వాటి విశేషాలు సదస్సులో చెప్పారు. సంప్రదాయాల పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములయ్యేలా చైతన్యం తీసుకొచ్చేలా బోధించారు. శిక్షణతోపాటు అక్కడి విశేషాలు, చరిత్రాత్మక ప్రాంతాలను సందర్శించామని, ఇది ఎంతో గొప్ప అవకాశమని వారు వెల్లడించారు.

జిల్లాకు గర్వకారణం:

రవీందర్‌రెడ్డి, డీఈఓ, నిర్మల్

'ప్రేరణ' జాతీయ స్థాయి సదస్సుకు రాష్ట్రం నుంచే జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికై అక్కడ శిక్షణ పొంది రావడం గర్వకారణం. ఈ కార్యక్రమం వారిలో ఆత్మస్థైర్యం, భవిష్యత్తులో లక్ష్య సాధనకు దిక్సూచిలా మారనుంది. పోటీ పరీక్షలకు మార్గదర్శకం. ఏకాగ్రత, చదువుపై మక్కువ పెరుగుతుంది. ఇలాంటి వారిని గుర్తించి ఉపాధ్యాయులు ప్రోత్సహించేలా ఏటా జిల్లా నుంచి ప్రాతినిధ్యం లభించేలా పిల్లలను తీర్చిదిద్దేందుకు తగిన కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం.

పురుగుమందు తాగి దంపతుల ఆత్మహత్యాయత్నం

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : దంపతులు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ ఘటన ఆదిలాబాద్ పట్టణంలో కలకలంగా మారింది. తలమడుగు మండలం రుయ్యాడికి చెందిన గౌడ రాజు(25)-గౌడ వైష్ణవి(22)లకు మూడేళ్ల కిందట వివాహమైంది. వైష్ణవి ప్రైవేటు నర్సింగ్ కళాశాలలో ఎంఎల్‌టీ కోర్సు మొదటి ఏడాది చదువుతోంది. ఇటీవల ఆమె జైనథ్ మండలం మాండగడలోని తల్లి గారింటికి వెళ్లింది. మంగళవారం ఆదిలాబాద్‌కు వచ్చిన ఆమె భర్తకు ఫోన్ చేసి రావాలని చెప్పింది. దీంతో ఆయన ఆదిలాబాద్‌కు రాగా ఇద్దరు కలిసి స్థానిక గాంధీ ఉద్యానవనానికి వెళ్లారు. అక్కడ వారిద్దరు పురుగు మందు తాగేశారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వారిని ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు తమను కలిసి ఉండనివ్వడం లేదని, తరచూ వేధిస్తున్నారంటూ వారు పేర్కొంటున్నారు. ఈ విషయమై వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్‌ను విచారించగా దంపతులు ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన విషయమై ప్రాథమిక విచారణ జరుపుతున్నామన్నారు. ఇంకా ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు. న్యాయమూర్తి వాంగ్మూలాన్ని నమోదు చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఆదిలాబాద్: 91541 18155
ఇచ్చోడ: 94935 57309
బోథ్: 91548 46671
ఉట్నూరు: 94410 86640

న్యూస్‌టుడే, ఆదిలాబాద్

? ఆదిలాబాద్ పట్టణంలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం సమీపంలో మిషన్ భగీరథ పైపులైనుకు రెండుచోట్ల లీకేజీలు ఏర్పడి రెండు నెలలుగా నీరు వృథాగా పోతోంది. బురదమయంగా మారడంతో ఇబ్బందులు పడుతున్నాం. - పి.మోహన్, విద్యానగర్

✓ పరిశీలించి మిషన్ భగీరథ పైపులైనుకు మరమ్మతులు చేసి లీకేజీని అరికడతాం. - అరుణ్, డీఈ

పూడిక తొలగించారు

బేల, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలోని కాలువలో పూడికను అధికారులు తొలగించారు. స్థానికులు సమస్యలను 'ఈనాడు' దృష్టికి తీసుకురావడంతో మంగళవారం 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షిక వార్త ప్రచురితమైంది. ఎంపీడీఓ మహేందర్ స్పందించి సంబంధిత పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు. ఆయన జేసీబీతో కాలువలో చెత్తాచెదారాన్ని తీయించారు.



అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : హనుమకొండలో ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. 2 పసిడి, 4 రజతాలు, 5 కాంస్య పతకాలు సాధించారు. అండర్-20 బాలికల విభాగంలో సీహెచ్.వసంత ట్రిపుల్ జంప్‌లో పసిడి, షాట్‌పుట్‌లో రజత పతకాలు సాధించారు. అండర్-20 బాలికల విభాగంలో డి.అరుణ హ్యామర్‌త్రోలో రజతం, అండర్-18 బాలురలో ఎ.జశ్వంత్ రేస్ వాక్ పోటీల్లో రజతం, అండర్-20 బాలికల విభాగంలో బి.జ్యోతి డిస్కస్‌త్రోలో కాంస్యం, అండర్-18 బాలురలో డి.సిద్ధార్థ రేస్ వాక్‌లో కాంస్య పతకాలు గెలిచారు. అండర్-20 బాలికల విభాగంలో కె.అశ్విని హైజంప్ పోటీల్లో రజతం అండర్-14 ఏళ్ల విభాగం బాలురల్లో హిరకుమ్ర నగేశ్ ట్రయథ్లాన్-ఎ(60మీ., 600మీ.ల పరుగు, లాంగ్ జంప్) పోటీల్లో పసిడి, కొట్నాక జాకేశ్ కాంస్యం, రాథోడ్ కార్తిక్ ట్రయథ్లాన్-బి(60మీ.ల పరుగు, లాంగ్ జంప్, షాట్‌పుట్) పోటీల్లో కాంస్యం, పెందూర్ సతీష్ కుమార్ జావెలిన్ త్రో విభాగంలో కాంస్య పతకం సాధించారు. వీరిని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడ్డి భోజారెడ్డి, పి.రాజేశ్, పెటా ప్రధాన కార్యదర్శి ఎన్.స్వామి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కాంతారావు, కోచ్‌లు సునంద్, రాకేశ్ అభినందించారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్ సునంద్

కేంద్ర పథకాల అమలు తీరుపై ఆరా



పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న ఎన్‌ఎల్‌ఎం బృంద సభ్యులు రఘునాథ్, నాగరాజు

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల అమలు తీరుపై జాతీయ స్థాయి పర్యవేక్షక(ఎన్‌ఎల్‌ఎం) బృందం సభ్యులు రఘునాథ్, నాగరాజు ఆరా తీశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డీఆర్డీఏ కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, పింఛన్లు, గ్రామీణ సడక్ యోజన, ఆవాస్ యోజన, భూముల డిజిటల్ రికార్డులు, తదితర పథకాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఆయా శాఖలకు సంబంధించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతి, నిధుల వ్యయం తదితర అంశాలపై చర్చించారు. బేల మండలం మశాల(బి), బెదోడ గ్రామాలను సందర్శించారు. ఈ నెల 11వ రకు వివిధ పనులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి కేంద్రానికి నివేదికను అందజేయనున్నారు. సమావేశంలో డీఆర్డీఓ సాయన్న, ఏడీఆర్డీఓ కుటుంబరావు, ఏపీడీ కృష్ణారావు, పంచాయతీరాజ్ ఈఈ శివరాం, గృహనిర్మాణశాఖ అధికారి బసవేశ్వర్, డీపీఎం గంగన్న, ఏఓ అందె గంగాధర్, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సహకార ఉద్యోగి మృతి

భీంపూర్, తాంసి, న్యూస్‌టుడే : శిరస్త్రాణం లేనిది ప్రయాణించని సహకార ఉద్యోగి ఆయన. కానీ విధులకు హాజరు కావాలన్న హడావుడిలో శిరస్త్రాణం మరచిపోవడమే చివరకు ఆయన ప్రాణం పోవడానికి కారణమైంది. తాంసి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో కార్యదర్శి(ఆఫీసు అసిస్టెంట్)గా పని చేసే కరంజి-టి వాసి కర్నేవార్ గణేష్(52) ఈ నెల 4న విధులకు హాజరయ్యే క్రమంలో తలమడుగు మండలం ఖోడద్ వద్ద శునకాలు అడ్డు రావడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందారు. కరంజి-టిలో జరిగిన అంత్యక్రియల్లో డీసీసీబీ ఛైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ ఛైర్మన్ దామోదర్‌రెడ్డి, సీఈవో కేశవ్, మాజీ సీఈవో లక్ష్మణరాజు, డైరెక్టర్ అశోక్‌రెడ్డి, పెద్ద సంఖ్యలో మండలవాసులు పాల్గొన్నారు. గణేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమారుడికి సొసైటీలో ఉద్యోగం ఇప్పిస్తామని డీసీసీబీ ఛైర్మన్ భరోసానిచ్చారు.



కర్నేవార్ గణేష్

చేపల వేటకు వెళ్లి యువకుడు..

సారంగాపూర్, న్యూస్‌టుడే: మండలంలోని స్వర్ణ గ్రామంలో చేపల వేటకు వెళ్లి గెడం సంతోష్(26) అనే వ్యక్తి మృతి చెందాడు. ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం మడెపల్లికి చెందిన గెడం అర్జున్ తన కుటుంబంతో కలిసి కొంత కాలంగా స్వర్ణ గ్రామంలో నివాసముంటున్నారు. పెద్ద కుమారుడు సంతోష్ గ్రామంలోని ఓ రైతు వద్ద పాలేరుగా పనిచేస్తున్నారు. సోమవారం వ్యవసాయ పనులకు వెళ్లిన సంతోష్ తిరిగి ఇంటికి రాలేదు. మంగళవారం ఉదయం తండ్రి అర్జున్ అతని సోదరుడు పంటక్షేత్రానికి వెళ్లి చూడగా పక్కనే ఉన్న స్వర్ణ వాగులో సంతోష్ మృతదేహం కనిపించింది. వాగు పక్కనే ఉన్న వ్యవసాయ విద్యుత్తు మోటరు డబ్బా నుంచి విద్యుత్తు తీగను నీటిలో వేసి చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు పరిసరాలు స్పష్టం చేస్తున్నాయి. అతడికి భార్య ఉన్నారు. తండ్రి అర్జున్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సారంగాపూర్ ఎస్సై సల్ల శ్రీకాంత్ తెలిపారు.

రైలు నుంచి పడి..

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : నడుస్తున్న రైలులో నుంచి దాదాపు 27 ఏళ్ల వ్యక్తి ఒకరు మంగళవారం మధ్యాహ్నం కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో రిమ్స్‌కు తరలించి చికిత్సలు అందిస్తున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఆర్‌టీఓ కార్యాలయం సమీపంలోని ఎల్‌సీ గేటు వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని బలవన్మరణం

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ పట్టణంలోని టీచర్స్ కాలనీలో అద్దెకు ఉంటున్న దీపల్లి నరేందర్‌రెడ్డి(27) సోమవారం రాత్రి తానుండే అద్దె ఇంట్లో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. వికారాబాద్ జిల్లా మేడికొండకు చెందిన దీపల్లి నరేంద్రరెడ్డి మూడేళ్ల కిందట ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అమ్మాయిని వివాహం చేసుకొని ఏడాదిన్నరగా ఆదిలాబాద్ టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్నట్లు మావల ఎస్‌ఐ విష్ణువర్ధన్ తెలిపారు. మద్యం మత్తులో ఉరేసుకొని ఉంటాడని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుని కుటుంబ సభ్యులు వికారాబాద్ నుంచి వచ్చాక వివరాలు తెలిసే అవకాశం ఉందన్నారు.

విద్యుదాఘాతంతో మేస్త్రీకి గాయాలు

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ గ్రామీణ మండలం కచ్‌కంటికి చెందిన మేస్త్రీ బింగి రాజేశ్వర్ పట్టణంలోని రాంనగర్‌లో భవన నిర్మాణ పనులు చేస్తున్నాడు. ఈ సందర్భంగా బయట ఉన్న మొదటి అంతస్తు గోడకు ప్లాస్టరింగ్ చేస్తుండగా సమీపంలోనే ఉన్న విద్యుత్తు తీగలు చేయికి తగలడంతో విద్యుదాఘాతానికి కింద పడ్డాడు. అదృష్టవశాత్తు కింద ఉన్న ఇసుకలో పడటంతో ప్రాణాపాయం తప్పింది. స్వల్ప గాయాలు కాగా రిమ్స్‌కు తరలించారు.

కుమురం భీం వర్ధంతి గోడప్రతుల ఆవిష్కరణ



గోడప్రతులను ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, అధికారులు, ఆదివాసీ నాయకులు

ఉట్నూరు, న్యూస్‌టుడే : ఈ నెల 17వ తేదీన జోడేఘాట్‌లో కుమురం భీం వర్ధంతిని ఘనంగా నిర్వహిస్తామని ఐటీడీఏ పీఓ ఖుష్బూగుప్తా పేర్కొన్నారు. మంగళవారం ఉట్నూరు ఐటీడీఏ కార్యాలయంలో భీం వర్ధంతికి సంబంధించిన గోడప్రతులను ఆదివాసీ సంఘాల నాయకులు, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేసి వర్ధంతి సభ విజయవంతం అయ్యేలా చూడాలన్నారు.

భవన నిర్మాణానికి కృషి చేయాలని వినతి

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను మున్నూరు కాపు సంఘం నాయకులు మంగళవారం కలిశారు. ఉట్నూరు డివిజన్ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు బొడ్డు కిరణ్, కందుకూరి జీవన్, ఉస్కెమల్ల దేవిదాస్ కరీంనగర్‌లో కేంద్ర మంత్రిని కలిసి భవన నిర్మాణానికి సహాయ సహకారాలు అందించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. నాయకులు ధరణి రాజేష్, నసాని శ్రీధర్, సత్యం, పొన్నం జగన్, సురేష్ ఉన్నారు.

సమష్టి కృషితో సాహిత్య వికాసం

ఉట్నూరు, న్యూస్‌టుడే : సమష్టి కృషితో సాహిత్యం వికసిస్తోందని కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ, సాహితీ వేదిక గౌరవ అధ్యక్షుడు రాథోడ్ భీంరావులు అన్నారు. మంగళవారం ఉట్నూరు సాహితీ వేదిక ఆధ్వర్యంలో కవి దామెర్ల నాగేశ్వరరావు రచించిన 'మహాత్ముని ముత్యాల హారాలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. సాహితీ వేదిక అధ్యక్షుడు జాధవ్ బంకట్‌లాల్, మర్సుకోల తిరుపతి, నాయకులు రాథోడ్ శ్రావణ్, మాధవ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలోనే దేశం అభివృద్ధి

గుడిహత్నూర్, న్యూస్‌టుడే : మోదీ పాలనలోనే దేశం అభివృద్ధి సాధిస్తుందని భాజపా జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ అన్నారు. గుడిహత్నూర్‌లో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షుడు శివాజీ, నాయకులు రాజేంద్రప్రసాద్, శైలేందర్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

అన్నదానాలు.. కుంకుమార్చనలు



ఇంద్రవెల్లి : ముత్నూరు గుట్టపై కొలువుదీరిన దుర్గాదేవి వద్ద నృత్యాలు చేస్తున్న మహిళలు



జామిడిలో సామూహిక కుంకుమార్చనలో...



లక్కారం హనుమాన్ మందిర్‌లో..



ధన్నూర్‌లో పూజలు చేస్తున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గజేందర్

ఇచ్చోడ, తాంసి, బోథ్, ఉట్నూరు గ్రామీణం, జైనథ్, ఇంద్రవెల్లి బజార్‌హత్నూరు, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా దుర్గాదేవి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. జైనథ్ మండలం గూడలో ముస్లిం దంపతులు భక్తులకు భోజనం వడ్డించారు. ఇచ్చోడలో ఒక భక్తుడు 56 రకాల నైవేద్యాలను సమర్పించారు.



ఇచ్చోడ : భక్తుడు సమర్పించిన 56 రకాల నైవేద్యాలు



బేల : హారతి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



పిప్పిరిలో పూజలు చేస్తున్న గ్రామస్థులు



గూడలో అన్నం వడ్డిస్తున్న ముస్లిం దంపతులు

ఏఐటీయూసీ బలోపేతానికి కృషి చేయండి

భుక్తాపూర్, న్యూస్‌టుడే : జిల్లాలో ఏఐటీయూసీ బలోపేతానికి కృషి చేయాలని రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 31న ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్, అధ్యక్షుడు గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

ఆపత్కాలంలో రక్తదానం

ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే : కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న భీంసరికి చెందిన తులసి గంగమ్మకు బి పాజిటివ్ రక్తం అత్యవసరమని వైద్యులు తెలిపారు. ఆ గ్రూపు రక్తం అందుబాటులో లేక కుటుంబ సభ్యులు యువజన కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డిని సంప్రదించారు. ఆయన జైనథ్ మండం కూర గ్రామానికి చెందిన గంగం దత్తురెడ్డికి సమాచారం అందించడంతో రిమ్స్‌కు వచ్చి రక్తదానం చేశారు.

సహకార సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



సుంకిడిలో మార్ట్‌ను పరిశీలిస్తున్న డీజీఎం స్వాతి

తలమడుగు, న్యూస్‌టుడే : సహకార సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు ప్రతి సభ్యుడు కృషి చేయాలని నాబార్డు డీజీఎం స్వాతి అన్నారు. రైతులకు మరింత చేరువ చేయడంతో పాటు వాటిని బలోపేతం చేసేందుకు ఆత్మనిర్భర్ పథకం కింద నాబార్డు ప్రత్యేక నిధులు విడుదల చేస్తుందన్నారు. మంగళవారం సుంకిడిలో తలమడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు అగ్రిమార్ట్‌ను ఆకస్మికంగా సందర్శించారు. డీడీఎం రవూఫ్, సంఘం ఛైర్మన్ దామోదర్‌రెడ్డి, సీఈవో మోతే శ్రీనివాస్, తలమడుగు మాజీ సర్పంచి కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి రైతులను మోసగించారు



డీఎస్పీకి ఫిర్యాదు అందిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న, భారాస నాయకులు

ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే : రుణమాఫీ పేరిట సీఎం రేవంత్‌రెడ్డి రైతులను మోసగించారని ఆయనపై కేసు నమోదు చేయాలని భారాస జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్ చేశారు. పార్టీ ఆదేశం మేరకు సీఎంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ జీవన్‌రెడ్డికి ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భారాస కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జోగురామన్న మాట్లాడారు. రమేష్, నారాయణ, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్లు ప్రహ్లాద్, నర్సింగ్‌రావు, నాయకులు రాజు, శ్రీనివాస్, ఆసిఫ్‌ఖాన్, రమేష్, ప్రశాంత్, సతీష్ పాల్గొన్నారు.

భారాస కార్యకర్త కుటుంబానికి మాజీ మంత్రి ఆర్థిక సాయం

జైనథ్, న్యూస్‌టుడే : జైనథ్ మండలం గిమ్మ గ్రామానికి చెందిన భారాస కార్యకర్త మంద సంటెన్న కుటుంబానికి మాజీ మంత్రి జోగు రామన్న ఆర్థిక సాయం అందించి ఉదారత చాటారు. సంటెన్న కొన్ని నెలల కిందట పిడుగుపడి మృతి చెందాడు. పేద కుటుంబం కావడంతో ఆర్థిక సాయం అందించాలని గ్రామ నేతలు మాజీ మంత్రి జోగు రామన్నను కోరగా రూ.1.50 లక్షలు నగదును పంపించారు. మంగళవారం గ్రామ భారాస నేతలు నగదును బాధిత కుటుంబానికి అందజేశారు. తర్వాత సంటెన్న కుమార్తె పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు భోజన్న, మాజీ ఉప సర్పంచి రమేష్, నాయకులు భగవాన్‌దాస్, పరమేశ్వర్, కూరెల్లి టిల్లు, సంజీవ్, కె.రమేష్, ఎం.రాజు, కాంగ్రెస్ నాయకుడు రాజీవ్ తదితరులు ఉన్నారు.



సంటెన్న కుటుంబానికి నగదు అందజేస్తున్న భారాస నేతలు

ప్రభుత్వ ప్లీడరుగా దయాకర్ నియామకం

ఎదులాపురం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ గ్రామీణ మండలం భీంసరికి చెందిన పి.దయాకర్ ఆదిలాబాద్ కోర్టుల జీపీ(ప్రభుత్వ ప్లీడర్)గా నియమితులయ్యారు. మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావును కలిసి సన్మానించారు. నియామక పత్రాన్ని ఆయనకు అందజేశారు. న్యాయవాదులు ముస్కు రమణారెడ్డి, చందూసింగ్, సంజయ్ వైరాగరే, భావనా సింగ్, మేకల మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ అనుమతి ఇవ్వొద్దు

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలో మున్నూరుకాపు సంఘానికి చెందిన స్థలాన్ని ఆక్రమించి తప్పుడు పత్రాలతో భవన నిర్మాణానికి దరఖాస్తు చేసుకున్న వ్యక్తులకు అనుమతి జారీ చేయొద్దని రాజకీయ పార్టీలకు అతీతంగా కౌన్సిలర్లు, మున్నూరుకాపు కులస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషాను కలిసి ఫిర్యాదు చేశారు. బల్దియా కార్యాలయానికి చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాళ్ల విఠల్, కలాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఆ స్థలం సంఘానికి చెందినదేనని గతంలో ఆర్డీఓ, అర్బన్ తహసీల్దార్ విచారణ చేపట్టి కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారని, దానిపై సదరు వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించారని పేర్కొన్నారు. కేసు విచారణలో ఉండగా మళ్లీ నిర్మాణ అనుమతికి దరఖాస్తు చేసుకున్నారని దాన్ని ఆమోదించవద్దని కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బండారి సతీష్, ఆకుల ప్రవీణ్, సంద నర్సింగ్, రఘుపతి, పందిరి భూమన్న, సోమ రవి, గంద్రత్ మహేందర్, కొండ గణేష్, కస్తాల అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న కౌన్సిలర్లు, మున్నూరుకాపు కులస్థులు

బాల కేంద్రం చిన్నారులకు సన్మానం

ఆదిలాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : రిఫ్లెక్షన్ గురు సంస్థ ఆధ్వర్యంలో దక్షిణ భారత శాస్త్రీయ నృత్యం(భరత నాట్యం, కూచిపూడి) పోటీలను ఆన్‌లైన్ మాధ్యమం ద్వారా నిర్వహించారు. అందులో జిల్లా బాల కేంద్రం చిన్నారులు సబ్ జూనియర్ విభాగంలో కొంకటి ఇతిక్ష, జూనియర్ విభాగంలో సంజన అవరగొండ, మంతినివార్ సమీక్ష, పాముగంటి వామిక, సన్నిధి దేశ్‌ముఖ్, క్షీరసాగర్ జాహ్నవి చక్కని ప్రతిభ కనబరిచి కళా శక్తి పురస్కారాలు గెలుచుకున్నారు. వీరిని జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు సన్మానించారు. జాతీయస్థాయిలో మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. బాలకేంద్రం పర్యవేక్షకుడు మిట్టు రవి, బాల కేంద్రం తల్లిదండ్రుల సంఘం బాధ్యులు ఉన్నారు.

ఉత్కంఠగా మాల సంఘం ఎన్నికలు



విజయం సాధించిన కొప్పుల రమేష్ వర్గ సభ్యులు సుధాకర్, ప్రభాకర్, సుధీర్, రాజేశ్వర్

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : మాల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నికలు మంగళవారం ఉత్కంఠగా సాగాయి. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో నిర్వహించిన ఎన్నికల్లో అల్లూరి భూమన్న వర్గంపై కొప్పుల రమేశ్ వర్గం విజయం సాధించింది. ప్రతి గ్రామ కమిటీ నుంచి ఇద్దరికి, మండల కమిటీ నుంచి అయిదుగురికి ఓటు హక్కును కల్పించారు. మొత్తం 367 ఓటర్లు ఉండగా 342 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం 2 వరకు కొనసాగింది. అనంతరం నాలుగు రౌండ్లలో ఓట్లను లెక్కించారు. జిల్లా అధ్యక్ష పదవికి మరోమారు పోటీపడిన అల్లూరి భూమన్న(142)పై కొప్పుల రమేష్(198) 56 ఓట్ల తేడాతో విజయం సాధించి జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా బబ్బిలి సుధాకర్, కోశాధికారిగా గంపల ప్రభాకర్ గెలిచారు. ఉపాధ్యక్షుడిగా ఏర సుధీర్, సంయుక్త కార్యదర్శిగా ముల్కల రాజేశ్వర్ గెలుపొందారు. ఎన్నికల నిర్వహణ బాధ్యతలను అశోక్, దయాకర్, రమేష్, సుభాష్, నర్సయ్య నిర్వహించారు. మావల పోలీసులు బందోబస్తు చేపట్టారు.

పోలీసుల సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నార్నూర్ (గాదిగూడ), న్యూస్‌టుడే : జిల్లాలోని ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ, దళితులు పోలీసుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. మంగళవారం ఆయన గాదిగూడ మండలంలోని ఝరి గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలు దీర్ఘకాలికంగా అనారోగ్యాలకు గురై బాధపడుతుంటే వారికి శిబిరంలో ఉచిత చికిత్సలు అందిస్తామన్నారు. 500 మందికి వైద్యం అందించారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు సాయినాథ్ (జనరల్ ఫిజీషియన్) శశికాంత్, గోపాల్, నవీన్, ఆదర్శ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, నార్నూర్-గాదిగూడ సీఐ రహీమ్ పాషా, ఎస్సైలు, పోలీసు సిబ్బంది రోగులకు ఉచితంగా భోజన సౌకర్యం కల్పించారు. వాహనాలను ఏర్పాటు చేశారు.



మాట్లాడుతున్న ఎస్పీ గౌస్ ఆలం

హామీలు నెరవేర్చండి

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : ముదిరాజ్ సామాజిక వర్గానికి ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలేంద్ర శివయ్య, ఉపాధ్యక్షుడు బొజ్జ నారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. తమ సామాజిక వర్గాన్ని బీసీ-ఎలోకి మార్చాలన్నారు. గంగపుత్రులు, ముదిరాజ్ కులస్థుల మధ్య వివాదాలను పరిష్కరించాలన్నారు. సంఘం పట్టణ అధ్యక్షుడు ధారవేణి రాము, దార్ల రవి, సలేంద్ర రాజు, బొజ్జ గంగన్న, చిన్నయ్య, రాములు, పాండురంగ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆనాటి జ్ఞాపకాలు.. ఆనంద బాష్పాలు



సుంకిడి పాఠశాల పూర్వవిద్యార్థులు

తలమడుగు, న్యూస్‌టుడే : సుంకిడి జిల్లా పరిషత్తు సెకండరీ పాఠశాల 2007-08 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉండంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. మిత్రులంతా ఆనాటి జ్ఞాపకాలను నెమరేసుకొని ఆనందబాష్పాలు కార్చారు. గురువులను సత్కరించారు. ఉపాధ్యాయులు లలిత, సంతోష్, లింగారెడ్డి, అమరేందర్, దేవేందర్, గంగయ్య, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

విజయ హనుమాన్ ఆలయ ఈవోగా చంద్రశేఖర్

ఈటీవీ - ఆదిలాబాద్ : ఆదిలాబాద్ చించెరువాడలో విజయ హనుమాన్ మందిరం ఈవోగా చిల్లప్ల చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇన్‌ఛార్జులతో సాగిన ఆలయంలో దేవాదాయశాఖ ఆదిలాబాద్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్‌కు పదోన్నతి కల్పిస్తూ రెగ్యులర్ ఈవోగా నియమించింది. మంగళవారం చంద్రశేఖర్ విధుల్లో చేరారు.

చరవాణి ఆర్డర్ చేస్తే రాయి వచ్చింది!

బజార్‌హత్నూర్, న్యూస్‌టుడే : చరవాణి ఆర్డర్ చేస్తే రాళ్లు వచ్చిన ఘటన మండలంలోని దేగామలో చోటుచేసుకుంది. దేగామకు చెందిన కొక్కుల ఉదయ్ శుక్రవారం రూ.24 వేల విలువైన ఫోన్ ఆర్డర్ చేయగా మంగళవారం మధ్యాహ్నం డెలివరీ బాయ్ అందించాడు. అతడి సమక్షంలోనే తెరిచి చూడగా రాయి, సబ్బుబిళ్ల వచ్చాయి. ఇదే గ్రామానికి చెందిన మరో వ్యక్తికి మధ్యాహ్నం 3 గంటల సమయంలో తను ఆర్డర్ చేసిన ఫోన్ మరో డెలివరీ బాయ్ తెచ్చివ్వగా తెరిచి చూపాలని గ్రామస్థులు కోరారు. చివరికి పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ సమక్షంలో డబ్బాను తెరవగా చరవాణి వచ్చింది. రాయి వచ్చిన వ్యక్తికి డబ్బును తిరిగి ఇచ్చారు. ఆన్‌లైన్‌లో వస్తువుల కొనుగోలు విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ అప్పారావు కోరారు.



చరవాణి డబ్బాలో వచ్చిన రాయి

గ్రామాల అభివృద్ధికి కృషి

బోథ్, న్యూస్‌టుడే : నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలకు నిధులు కేటాయించి, గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బోథ్ మండలం బాబెరతండాలో రూ.10 లక్షలతో మంగళవారం పాఠశాల ప్రహరీ పనులను ఆయన ప్రారంభించారు. బోథ్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. బోథ్, మర్లపెల్లిలలో దుర్గామాత విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నారాయణరెడ్డి, నాయకులు సురేందర్ యాదవ్, శ్రీధర్‌రెడ్డి, స్వామి, తాహెర్ బిన్, రుక్మణ్‌సింగ్, సదానందం, రమణాగౌడ్, సోమేశ్వర్, సుధీర్‌రెడ్డి, బాపురెడ్డి, ఈశ్వర్, వినయ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కుల లబ్ధిదారులతో ఎమ్మెల్యే అనిల్ జాదవ్